క్లుప్తంగా

ఘనంగా బోనాల ఉత్సవాలు



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

కందుకూరు: మండల కేంద్రంలో ఆదివారం మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. జస్వంత్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ప్రథమ స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్ జట్టుకు రూ.14వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పంజాబ్ జట్టుకు రూ.7వేలతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.కృష్ణగౌడ్, బి.రాంరెడ్డి, ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారంలో ఆదివారం రామాలయం, ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి వేద పండితుడు రాజుశర్మ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు మాజీ జడ్జి జెస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హాజరై గ్రామస్తులతో కలిసి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్‌లు గొరిగె రాజు, వై.రాంరెడ్డి, అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అండేకార్ సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు సిద్ధం

- శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



అభయాంజనేయస్వామి ఆలయం

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠతో పాటు పోచమ్మ తల్లి, నాగబంధ, నాబిశీల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి మొదలుకొని ఐదు రోజుల పాటు 18వ తేదీవరకు ప్రతి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మహోత్సవ కార్యక్రమాలను శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎక్కడా లేని విధంగా గ్రామంలో హనుమాన్ ఆలయం నిర్మించామన్నారు. ఎంతో మంది దాతల సహకారంతో రూపుదిద్దుకున్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. గ్రామంలో ఐదురోజుల పాటు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయని తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.



మిథులానగర్‌కాలనీలోకి చేరిన వరదనీరు



వరదనీటి కారణంగా మిథులానగర్‌లో ఇంటికే పరిమితమైన ఓ కుటుంబం

కాలనీలను ముంచేశారు..!

- చెరువులోకి వెళ్లాల్సిన వరదనీటిని ట్రంక్‌లైన్‌లోకి మళ్లింపు
- ఓవర్ ఫ్లోతో పూర్తిగా జలమయమైన మిథులానగర్, సత్యసాయినగర్
- రాజకీయ ఒత్తిళ్లతో ప్రతీసారి ముంపునకు గురవుతున్నామంటూ కాలనీవాసుల ఆవేదన



వీధులను ముంచెత్తిన వరదనీరు

మీర్‌పేట: పైనున్న కాలనీల కోసం కిందున్న కాలనీలను ముంచేశారు..! వర్షాకాలం వచ్చిందంటే మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీలను వరదనీరు ముంచెత్తడం షరా మామూలే.. ఎన్నో ఏళ్లుగా ముంపునకు గురవుతున్నా... శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన చర్యలేవి ముంపు నుంచి విముక్తి కల్పించడం లేదన్నది వాస్తవమే. భారీ వర్షాలు రావడం.. ఇళ్లను, వీధులను ముంచెత్తడం ప్రతీసారి జరిగే పరిణామమే తప్పా సమస్య పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదని ముంపు ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఆయా కాలనీలు పూర్తిగా ముంపునకు గురవడంతో చేసేది లేక రాత్రి నుంచి ఉదయం వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయమైనా వరద ప్రవాహం తగ్గక పోవడంతో సాయంత్రం వరకు ఇళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

24 గంటలు ముంపులోనే..

మీర్‌పేట కార్పొరేషన్‌లో ముంపు సమస్య పరిష్కారం కోసం గతంలో గొలుసు కట్టు చెరువులకు అనుసంధానం చేస్తూ ఎస్ఎన్‌డీపీ నాలా, డ్రైనేజీ నీరు వేరుగా వెళ్లేందుకు ట్రంక్‌లైన్ నిర్మాణం చేపట్టారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువన ఉన్న బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి పెద్దఎత్తున వరదనీరు వస్తుండడంతో పెద్ద చెరువులోకి వెళ్లాల్సిన నీటిని ట్రంక్‌లైన్‌లోకి మళ్లించడంతో ఓవర్‌ఫ్లో అయి మిథులానగర్, సత్యసాయి నగర్‌లను ముంచెత్తింది. చెరువులోకి నీటిని మళ్లిస్తే ఎక్కడ బ్యాక్ వాటర్ తమ కాలనీలను ముంచెత్తుతుందోనని, ట్రంక్‌లైన్‌లోకి మళ్లించి తమ కాలనీలను ముంచెత్తారని మిథులానగర్ వాసులు పేర్కొంటున్నారు. ఇదంతా తెలిసినా మీర్‌పేట అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాన్ని మిథులానగర్ వాసులు వ్యక్తం చేస్తున్నారు. ప్రతీసారి ఇదే పునరావృతం అవుతోందని, పైనున్న కాలనీలను రక్షించేందుకు కిందున్న కాలనీలను ముంపునకు బలి చేయడం సరైంది కాదని, 24 గంటలు తాము ముంపులోనే ఉన్నామని, నిత్యావసర వస్తువులు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన డప్పు భాగ్యమ్మ, ఎర్ర తొంట హరికృష్ణ(మున్నా) అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా.. వారికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, అమీర్‌పేట్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాయప్ప, పెద్ద కురుమ పెద్దలు కడల సామయ్య, ఇమ్మడి పాండయ్య, మాజీ వార్డు సభ్యులు సంభ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సూచించారు. కందుకూరుకు చెందిన ఎస్.స్వాతి, మానుక భాగ్యమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా.. ఖర్చులకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60 వేల చొప్పున మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఆదివారం వారి కుటుంబ సభ్యులకు కేఎల్ఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అందరూ పార్టీలకతీతంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.ప్రశాంత్‌కుమార్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

పండుగ వేళ ఆర్టీసీ నిలువు దోపిడీ

- స్పెషల్ పేరుతో 60శాతానికిపైగా టికెట్ ధర పెంపు
- నోరెళ్లబెడుతున్న ప్రయాణికులు

కందుకూరు: రాఖీ పండుగ వేళ ఆర్టీసీ ప్రయాణికులను నిలువు దోపిడీ చేసింది. ఏకంగా టికెట్ ధర 66శాతానికి పైగా పెంచి వసూలు చేసింది. దీంతో ప్రయాణికులు నోరువెళ్లబెట్టాల్సి వచ్చింది. కందుకూరు చౌరస్తా నుంచి కడ్తాల్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలంటే సాధారణంగా రూ.30 టికెట్ ధర ఉంది. కాగా రాఖీ పండుగ వేళ శనివారం రాత్రి ఓ ప్రయాణికుడు కందుకూరు చౌరస్తాలో అచ్చంపేట ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కి కడ్తాల్ టికెట్ తీసుకున్నాడు. కండక్టర్ మాత్రం రూ.50 టికెట్ చేతిలో పెట్టింది. సాధారణంగా రూ.30 టికెట్ ఉండగా.. రూ.50 ఎందుకు ఇవ్వాలని ప్రయాణికుడు ప్రశ్నించడంతో పండుగకు స్పెషల్ బస్సు నడిపిస్తున్నామని, అందుకు పెంచామని కండక్టర్ తెలిపారు. దీంతో ప్రయాణికుడు ఆశ్చర్యపోయాడు.



కందుకూరు-కడ్తాల్‌కు వసూలు చేసిన టికెట్ ధర

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మీర్‌పేట: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మీర్‌పేట కార్పొరేషన్ నూతన కమిటీని ఆదివారం ఉత్సవ సమితి మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్ గణాటి సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిల్లంపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం జగన్, పల్లె జంగయ్యగౌడ్, భీంరాజ్, గౌరవ అధ్యక్షులుగా పసునూరి భిక్షపతి చారి, కీసర హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చప్పిడి జంగారెడ్డి, వి.గోపినాథ్‌చారి, దిండు భూపేశ్‌గౌడ్, కాశీరాం యాదవ్, కీసర కృష్ణారెడ్డి, గాజుల మధు, ఉయ్యాల నవీన్‌గౌడ్, కోశాధికారిగా ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్, కార్యదర్శులుగా జటావత్ రవి నాయక్, సిద్దాల బాలప్ప, గోపియాదవ్, తీగల సాయినాథ్‌రెడ్డి, జి.కృష్ణారెడ్డి, బి.నర్సింహయాదవ్, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, బొజ్జ పరమేశ్, డి.మల్లికార్జున్, ఎస్.ప్రసాద్, శ్యాంసుందర్, కార్తీక్ సాగర్, వెంకటేశ్‌గౌడ్, ఎస్.రాంగోపాల్, భాస్కర్, అనిల్ ఎన్నికయ్యారు. మీర్‌పేట కార్పొరేషన్‌లో రాజకీయాలకతీతంగా హిందూ పండుగలను ఐకమత్యంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి నియోజకవర్గ కన్వీనర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కో కన్వీనర్ కోడూరు సోమేశ్వర్ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్

చేవెళ్ల: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీవరకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తెలిపారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. 2025 జూన్ 5వ తేదీవరకు కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గతంలో రైతు బీమాకు దరఖాస్తు చేసుకున్న రైతులు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. బీమాకు దరఖాస్తు చేసుకునే రైతులు తమ పరిధిలోని ఏఈఓలను కలిసి దరఖాస్తులను అందజేయాలని సూచించారు. దరఖాస్తులకు రైతు బీమా దరఖాస్తు ఫారం నామినేషన్ ఫారం, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డులను జతచేయాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక గతంలో రైతు బీమాకు దరఖాస్తులు చేసుకున్న రైతులు ఏమైన మార్పులు చేర్పులు ఉంటే చేసుకునేందుకు ఈనెల 12వ తేదీవరకు అవకాశం ఉందని తెలిపారు. ఆధార్‌కార్డు మార్పిడి, నామినీ మార్పిడి, లాంటి మార్పులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. క్లస్టర్ల వారీగా రైతులు ఏఈఓలను కలిసి దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు సంబంధిత వ్యవసాయాధికారులను స్పందించాలని కోరారు.



చేవెళ్ల వ్యవసాయ కార్యాలయం

దరఖాస్తుల ఆహ్వానం

శంకర్‌పల్లి: జూన్ 5వ తేదీవరకు పట్టా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి వ్యవసాయాధికారి చైతన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

13 వరకు అవకాశం

మొయినాబాద్: రైతు బీమా పథకానికి ఈ నెల 13వరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొంది.. 18-59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో మండల వ్యవసాయాధికారులను సంప్రదించి దరఖాస్తు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వరద నీరు నిల్వకుండా చర్యలు

ఎల్బీనగర్: డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీ కాలనీలోని రోడ్లు, ఇళ్లలోకి నీరు చేరిందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆదివారం ఆయన కార్పొరేటర్ హైడ్రా అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సూపర్‌వైజర్ సతీష్, కాలనీ అధ్యక్షులు యాతయ్య, సభ్యులు రాజు. హరి, నాయకులు విష్ణు వర్ధన్‌రావు, శంకరయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్యూబాకు అండగా ఉందాం



నిధి సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

వనస్థలిపురం: అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షలకు వ్యతిరేకంగా గత 60 ఏళ్లుగా క్యూబా ప్రజలు పోరాడుతున్నారని, వారికి ప్రపంచ కార్మికులు అందరూ అండగా ఉండాలని సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం వనస్థలిపురం రైతుబజారు వద్ద క్యూబా సంఘీభావ నిధి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. అమెరికాలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా క్యూబా పట్ల పాలకుల వైఖరి ఒక్కటిగానే ఉందని అన్నారు. క్యూబా ఆవిర్భావ దినం నుంచి మన ప్రజలు క్యూబాకు అండగా ఉంటున్నారని అన్నారు. ధన, వస్తు రూపాలలో అనేకమార్లు క్యూబా ప్రజలకు చేయూతనిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, లక్ష్మణ్, భారతమ్మ, కాశయ్య, వెంకటయ్య, జయమ్మ, వరలక్ష్మి, ఝాన్సీ, నిర్మల, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

చేవెళ్ల: తాము చదివిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి.. మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 1990లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బండారి చెన్నారెడ్డి, కనకమామిడి తిరుపతిరెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, మువ్వ అమరేందర్‌యాదవ్, మల్గారి లక్ష్మారెడ్డి, గడ్డం దయానంద్ కలిసి రూ.5లక్షల నిధులతో మరుగుదొడ్లు, మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించారు. చేవెళ్లకు చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో వారందరూ ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆదివారం వారందరూ కలిసి పనులను ప్రారంభించారు. పాఠశాలకు సహకారం అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని రెడ్డిశెట్టి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. దీంతో పాటు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా మరో లక్ష రూపాయలను పాఠశాల అభివృద్ధికి అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం తగదు

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం పండగ వేళ బస్సు చార్జీలను పెంచి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాఖీ పండుగ సందర్భంగా ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచడం సరికాదన్నారు. పేదలపై పండగ వేళ ఆర్థిక భారం మోపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. బస్‌స్టాప్‌లలో ప్రయాణికులు నిండుగా ఉన్నా బస్సులు మాత్రం సరిపడా నడపడం లేదని ఆరోపించారు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉచిత బస్సు పథకం ప్రయాణికుల పాలిట శాపంగా మారిందన్నారు. పండగ వేళల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తరుణ్, శివ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కమలనాథులు

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లెల్లో బీజేపీ జెండాను ఎగుర వేస్తామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మహా సంపర్క్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయనాయక్ ఆధ్వర్యంలో కమలనాథులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మండలంలోని మొండిగౌరెల్లి, నందివనపర్తి, నక్కిర్తసింగారం, చింతుల్ల, ధర్మన్నగూడెం, తాడిపర్తి గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ.. ప్రచారం చేస్తున్నారు. కేంద్ర నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొంటున్నారు. బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో మల్లన్నస్వామి, కల్యాణం, బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కొలవాలని, భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆలయ నిర్వాహకులు ఉత్సవాల్లో పాల్గొన్న అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు రాజేందర్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మహేశ్, రఫిక్, సూర్య, విఠల్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేశారు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన మాజీ వార్డుసభ్యుడు గోపాలకృష్ణ దంపతులు రూ.51వేలు, పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వనాథం రూ.21,999, నలమోని శ్రీధర్ రూ.21వేల విరాళాలను ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం దాతలు తమ విరాళాల చెక్కును మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గ కిషోర్, గంధం ఆనంద్, సాయిూశ్వర్‌రెడ్డి, భూపాల్, శ్రీనివాసచార్యులు, సూరిశెట్టి నర్సింలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ పేరుతో రాజకీయాలు తగదు



సమావేశంలో పాల్గొన్న సంక్షేమ సంఘం సభ్యులు

ఎల్బీనగర్: కాలనీపేరు చెప్పుకుని రాజకీయాలు చేస్తూ కాలనీకి చెడ్డపేరు తేవాలని చూస్తే ఉపేక్షించేది లేదని వైదేహినగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ కాలనీ 824 ప్లాట్ల యజమానుల సమ్మతితో ఆదివారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. వైదేహినగర్ నార్త్ కాలనీ అసోసియేషన్ పేరుతో మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇప్పటికే కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎంపీ రాజేందర్ సహకారాలతో కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని 118 జీఓ ఇప్పటికే కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఓపెన్ ల్యాండ్ ట్యాక్స్‌పై కూడా ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కిషన్‌రావు, కోశాధికారి శివరాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి పాల్గొన్నారు.